శ్రీ క్రోధి నామ సంవత్సరం ఫలితాంశాలు

కలి గతాబ్ది: 5125, క్రీస్తుశకం: 2024-25, శాలివాహన శకం:1946, భారత స్వాతంత్ర్య శకం: 77-78

నవనాయక ఫలితాలు

ఈ సంవత్సరానికి రాజు-కుజుడు, మంత్రి-శని, సేనాధిపతి-శుక్రుడు, సస్యాధిపతి-కుజుడు, ధాన్యాధిపతి-రవి, అర్ఘ్యాధిపతి-శుక్రుడు, మేఘాధిపతి-శుక్రుడు, రసాధిపతి-గురు, నీరసాధిపతి-కుజుడు, రాజవాహనం- నౌక, పశుపాలకుడు-యముడు, గోష్ఠాగార ప్రాపకుడు (స్థాన సంరకక్షుడు)- శ్రీకృష్ణుడు

రాజు కుజుడు కావడం వల్ల ఈ ఏడాది రెండు తూముల వర్షం కురుస్తుంది. సముద్రంలో 9 భాగాలు, పర్వతాల్లో 9 భాగాలు, భూమిపై 2 భాగాల వర్షం కురుస్తుంది. కుజుడు రాజు కావడం వల్ల లోకంలో అగ్నిభయం, శస్త్ర భయం పెరుగుతాయి. అల్పవృష్టి, పంటల దిగుబడి తగ్గుతుంది. చోరుల భయం పెరుగుతుంది. యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుంది. ఎర్రని వస్తువులు, కందులు, మిర్చి, బెల్లం, కలప, బంగారం, వెండి, సీసం, ఇనుము, కంచు, ఇత్తడి, రాగి, యంత్ర పరికరాలు, బొగ్గు, పెట్రోలు, ఆముదం, జనపనార, ఉల్లిగడ్డలు, తేయాకు, కాఫీ గింజలు, పసుపు, సిమెంటు తదితర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి.

రాజ వాహనం నౌక కావడం వల్ల ప్రజల్లో కల్లోలం ఉంటుంది. ఆకలి బాధలు పెరుగుతాయి. పశువులకు అధిక నష్టం వాటిల్లుతుంది. దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటాయి. ప్రజా రవాణా సౌకర్యం తగ్గుతుంది.

మంత్రి- శని: వర్షపాతం తక్కువగా నమోదవుతుంది. పంట విస్తీర్ణం తగ్గుతుంది. పాలకులు ప్రజలను పీడిస్తారు. ధన, మాన, ప్రాణ హాని కలుగుతుంది.

సేనాధిపతి- శుక్రుడు: వర్షపాతం ఓ మోస్తరుగా ఉంటుంది. పత్తి, నూలు, దుస్తులు, బంగారం ధరలు పెరుగుతాయి. కామంపై ఆసక్తి పెరుగుతుంది. స్త్రీలకు రక్షణ కరువవుతుంది.

సస్యాధిపతి- కుజుడు: కందులు, మిర్చి, వేరుశనగ, ఎర్రని ధాన్యాలు, ఎర్ర నేలలకు మంచి కాలం. మాగాణి పంటలు మధ్యమంగా పండుతాయి.

ధాన్యాధిపతి- రవి: వర్షాలు తక్కువగా ఉంటాయి. రాజకీయ క్రీడ రసకందాయంగా ఉంటుంది. సమాజంలో నైతికత లోపిస్తుంది. దుష్ట చింతన పెరుగుతుంది. కొబ్బరి కాయలు, మామిడి, పనస, అరటి తదితర పండ్ల ధరలు పెరుగుతాయి. బంగారం, వెండి ధరలు పెరిగి నిలకడగా ఉంటాయి.

అర్ఘ్యాధిపతి-శుక్రుడు: తెల్లని ధాన్యం బాగా పండుతుంది. బియ్యం, పట్టు, రాగి, దుస్తులు, పత్తి ధరలు అనుకూలంగా ఉంటాయి.

మేఘాధిపతి- శుక్రుడు: అతివృష్టి ఉంటుంది. కొన్ని పంటలు అధిక దిగుబడిని ఇస్తాయి. పాల ఉత్పత్తి పెరుగుతుంది.

రసాధిపతి- గురుడు: అవసరానికి వర్షాలు కురుస్తాయి. కొన్ని పంటలు సమృద్ధిగా పండుతాయి.

నీరసాధిపతి- కుజుడు: మిర్చి, పొగాకు, ఇనుము, ఉక్కు, యంత్ర పరికరములు, రాగి, ఇత్తడి, కంచు తదితరాల ధరలు పెరిగి నిలిచి ఉంటాయి. అపర ధాన్యాల ధరలు హెచ్చుతాయి.

పశుపాలకుడు-యముడు: అల్పవృష్టి, పశువులకు రోగాది పీడలు అధికమవుతాయి.

గోష్టాగార ప్రాపకుడు, గోష్ఠాద్బహి ప్రాపకుడు- శ్రీకృష్ణుడు: పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయి. ప్రజలకు క్షేమం చేకూరుతుంది.

నవనాయకుల ఫలితాలను క్రోఢీకరించి చూడగా.. క్రోధి నామ సంవత్సరం మిశ్రమంగా ఉంది. ప్రజలు రోగ పీడితులు అవుతారు. పాలకుడు లోభంతో వ్యవహరిస్తారు. ఈతి బాధలు పెరుగుతాయి. అల్పవృష్టి కారణంగా పంటల విస్తీర్ణం, దిగుబడి తగ్గుతాయి. రాజకీయంగా తీవ్ర ఒడుదొడుకులు ఎదురవుతాయి.

గురు సంచారం: శ్రీ క్రోధి నామ సంవత్సరం చైత్ర కృష్ణ అష్టమి (1-5-2024) పగలు 12-56 గంటలకు గురువు వృషభ రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. వృషభంలో గురువు ఉండటం వల్ల శిశువులు, స్త్రీలు, పశువులకు హాని కలుగుతుంది. వర్షపాతం తగ్గుతుంది.

శని సంచారం: దాదాపు ఈ సంవత్సరం అంతా శని కుంభరాశిలో ఉంటాడు. వర్షాభావ పరిస్థితులు ఉంటాయి. ప్రజల్లో భయాందోళనలు కలుగుతాయి. వివిధ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుంది. సంవత్సరం చివరిలో మీనరాశిలోకి ప్రవేశిస్తాడు.. పరిస్థితుల్లో పెద్దగా మార్పేం ఉండదు. దుర్మార్గులు ప్రబలుతారు. ప్రకృతి విపత్తులు చోటు చేసుకోవచ్చు. రాజులకు, పాలకులకు నష్టం.